# రైల్వే అండర్‌ పాస్‌ విస్తరణ జరిగేనా..?

**ఇరుకుగా హాఫీజ్‌పేట్‌ ప్రేమ్‌ నగర్‌ రైల్వే అండర్‌ బ్రిడ్జి**

- తాత్కాలిక సిగ్నల్‌తో ట్రాఫిక్‌ ఇబ్బందులు
- ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యం



వైశాలీనగర్‌ లింకు రోడ్డులో రైల్వే అండర్‌ బ్రిడ్జిలో..



రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక ట్రాఫిక్‌ సిగ్నల్‌

**చందానగర్‌:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఐటీ సంస్థలు పెరుగుతున్న అదే విధంగా ఉద్యోగులు భారీగా చేరుతున్న సందర్భంగా ఉదయం, సాయంత్రం వేళ రోడ్లు అన్ని ట్రాఫిక్‌ జామ్‌లతో వాహనదారులు సతమతమవుతున్నారు. మియాపూర్‌, మదీనాగూడ, దీప్తిశ్రీనగర్‌ తదితర ప్రాంతాల నుంచి ఐటీ ఉద్యోగులు హాఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని వైశాలీనగర్‌ మీదుగా ప్రేమ్‌నగర్‌ వెనకాల ఉన్న లింక్‌ రోడ్డు మార్గాన వెళ్తున్నారు. అయితే ప్రేమ్‌నగర్‌ వద్దకు రాగానే రైల్వే అండర్‌ బ్రిడ్జి ఇరుకుగా ఉండడం వలన ఒక వైపు వాహనాలు వస్తే మరోవైపు ఉన్న వాహనాలు నిలుపుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొన్ని సంవత్సరాల నుంచి జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎస్‌ఆర్‌డీపీ, సీఆర్‌ఎంపీ కింద లింక్‌ రోడ్లు, అండర్‌ పాస్‌ల నిర్మాణాలు హెచ్‌ఆర్‌సీఎల్‌ అధికారులు నిర్వహిస్తున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే లింకు రోడ్లు, అండర్‌ పాస్‌లు నిర్మించారు. కానీ హాఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని వైశాలి నగర్‌ నుంచి బొటానికల్‌ గార్డెన్‌, మసీద్‌బండలకు వెళ్లే లింకు రోడ్డు నిర్మించారు. అండర్‌ బ్రిడ్జి కింద మురుగు నీటి పైప్‌లైన్‌, వాహనరాకపోకలు సాగించాల్సిన ఉంటుంది. ట్రాఫిక్‌ సమస్య అధికంగా ఉండడం వల్ల గత కొన్ని నెలల క్రితం తాత్కాలికంగా ట్రాఫిక్‌ సిగ్నల్‌ ఏర్పాటు చేశారు. ఈ సమస్యపై శాశ్వత పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ఫలితం లేదని వాహనదారులు వాపోతున్నారు.



రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద భారీగా ట్రాఫిక్‌ జామ్‌

**సమస్యలు ఇవే..**

- రైల్వే అండర్‌ బ్రిడ్జి కింద రోడ్డు, మురుగు కాలువ ఉండడంతో ఇరుకుగా మారింది.
- బ్రిడ్జి కింద రోడ్డు నిర్మాణంతో పాటు మురుగు నీటి కాలువ నిర్మించారు. కేవలం ఒక వాహనం వెళ్లే విధంగా ఉండడంతో తాత్కాలికంగా సిగ్నల్‌ ఏర్పాటు చేశారు.
- ఇరుకు రోడ్డులోనే నాలా ఏర్పాటుతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- సిగ్నల్‌ వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో భారీగా ట్రాఫిక్‌ జాంలతో వాహనదారులు తీవ్ర కష్టాలు పడుతున్నారు.
- సిగ్నల్‌ సమయం తక్కువగా ఉండడం వల్ల కూడా కార్లు మాత్రం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ట్రాఫిక్‌ సమస్య పరిష్కరించాలి**



రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక సిగ్నల్‌ వల్ల ఉదయం, సాయంత్రం సమయాలలో భారీగా ట్రాఫిక్‌ సమస్య ఉంటుంది. అండర్‌ బ్రిడ్జి నుంచి ఇరువైపుల వాహనాలు ఇష్టానుసారంగా రాకుండా డివైడర్‌ను ఏర్పాటు చేయాలి.
– సీబీ రెడ్డి, వాహనదారుడు

**మురుగు కాలువా, రోడ్డు ఒక అండర్‌ పాస్‌లోనే..**



రైల్వే అండర్‌ బ్రిడ్జి కింద మురుగు నీటితో పాటు ఒక వాహనం వెళ్లే విధంగా రోడ్డు ఉండడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు కురిస్తే అంతే వాహనాలు మునిగే వరద నీరు బ్రిడ్జి కిందకు చేరుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అండర్‌ పాస్‌ బ్రిడ్జి విస్తరణ చేపట్టాలి.
– మహేష్‌, వాహనదారుడు

**పరిష్కారం ఇలా..**

- రైల్వే అండర్‌ బ్రిడ్జి కింద రోడ్డు విస్తరణ చేపట్టాలి.
- తాత్కాలిక ట్రాఫిక్‌ సిగ్నల్‌ వద్ద ట్రాఫిక్‌ పోలీస్‌ సిబ్బందిని ఏర్పాటు చేయాలి.
- వైశాలీనగర్‌ నుంచి రైల్వే అండర్‌ బ్రిడ్జి వరకు డివైడర్‌ను ఏర్పాటు చేయాలి.
- రోడ్డు ఇరువైపుల వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.
- రోడ్డుతో పాటు ఉన్న నాలాను మరోపక్కకు మార్చాలి.
- ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకొని రైల్వే అధికారులతో మాట్లాడి రోడ్డు విస్తరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.

## భగవద్గీత గ్రంథాల పంపిణీ



భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

**జిన్నారం (పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో హైదరాబాద్‌ నగరానికి చెందిన ప్రబోధా సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులకు భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. ప్రబోధా సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు సీహెచ్‌ గిరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇతిహాసాలను తెలుసుకోవాలన్నారు. ఇంద్రియాలను జయించడమే కాకుండా పండుగ అర్థాన్ని, కుటుంబ విలువలను ఉత్తమ గ్రంథాలను చదవడం వల్ల తెలుసుకోగలమన్నారు. కార్యక్రమంలో నరసింహచారి, కుమార్‌, జశిత్‌కుమార్‌, మధు, లక్ష్మీ నాగమణి, శారద, సామ్రాట్‌, గోపాల్‌, జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆంజనేయనగర్‌లో నాకాబందీ..



వాహన పత్రాలను పరిశీలిస్తున్న డీసీపీ సురేష్‌ కుమార్‌

**మూసాపేట:** కూకట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఆంజనేయ నగర్‌లో బాలానగర్‌ జోన్‌ డీసీపీ సురేష్‌ కుమార్‌ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. డీసీపీతో పాటు , ఏసీపీ రవికిరణ్‌ రెడ్డి నేతృత్వంలో 101 మంది పోలీస్‌ సిబ్బంది నాకా బందీలో పాల్గొన్నారు. సుమారు 1205 వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేకుండా ఉన్న వాహనాలు, తప్పుడు నెంబర్‌ ప్లేట్‌ ఉన్న వాహనాలు, మద్యం సేవించి డ్రైవింగ్‌ చేస్తున్న వారిని వారి వాహనాలను పరిశీలించి కేసు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాలు 68, మూడు చక్రాల వాహనం 1, నాలుగు చక్రాల వాహనాలు 4ను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన 11 మందిపై కేసులు నమోదు చేశారు.

## 9, 11వ తేదీల్లో మండల స్థాయి ఖోఖో సెలక్షన్స్‌

**రాజేంద్రనగర్‌:** శివరాంపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాలలో ఈ నెల 9వ తేదీన కబడ్డీ, వాలీబాల్‌, 11న ఖోఖో మండలస్థాయి టోర్నమెంట్స్‌, సెలక్షన్‌ను ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జోనల్‌ ఇన్‌చార్జి గాంగ్య నాయక్‌ తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను మండల ఎంఈవో శంకర్‌ రాథోడ్‌, శివరాంపల్లి హెచ్‌ఎం భూక్య శ్రీను నాయక్‌లు ప్రారంభిస్తారన్నారు. అండర్‌–14లో పాల్గొనాలన్నారు. 1-1-2012 లోపు జన్మించి ఉండాలని... అండర్‌–17 పోటీల్లో పాల్గొనాలంటే 1-1-2009 లోపు జన్మించి ఉండాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. బోనఫైడ్‌, ఆధార్‌ జిరాక్స్‌ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీడీలు జ్యోతి, బాలస్వామి రెడ్డి, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు. వివరాలకు ఫోన్‌: 98804 99993లో సంప్రదించాలన్నారు.

## హుక్కా సేవిస్తున్న 10 మంది అరెస్టు



**మైలార్‌దేవ్‌పల్లి:** మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని శాస్త్రీపురంలో అర్ధరాత్రి పోలీసులు హుక్కా సేవిస్తున్న ఇంటిపై దాడి చేశారు. ఎస్‌ఐ అబ్దుల్లా సమాచారం మేరకు... షంషీర్‌ అనే వ్యక్తి కొన్ని రోజులుగా ఇంట్లో కొంత మందితో హుక్కా సేవిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి ఇంటిపై దాడి చేసి హుక్కా పాట్స్‌, సెల్‌ఫోన్‌లతో పాటు పది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంస్థాగత కమిటీల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్‌

**గచ్చిబౌలి:** జీహెచ్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో సంస్థాగత కమిటీల ఏర్పాటుపై పూర్తి స్థాయి దృష్టి పెట్టాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం డివిజన్‌ కమిటీలు, మోర్చా కమిటీలు, బూత్‌ కమిటీలు, శక్తి కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి స్థితిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీని బస్తీ స్థాయి నుంచి పూర్తిగా పటిష్టం చేసి ఏ ఎన్నికలు వచ్చినా విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇప్పటికీ ఇంకా వేయని కమిటీలను అన్ని స్థాయిలో పూర్తి చేసి ఎన్నికల సంసిద్ధులను చేయాలని ఆయన సూచించారు. పార్టీ, ఇతర స్థాయి కమిటీలు పటిష్టంగా ఉంటేనే పార్టీ సంస్థాగతంగా పటిష్టంగా ఏర్పడుతుందన్నారు. పార్టీ విస్తరణ కోసం క్రమబద్ధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపుపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహిపాల్‌రెడ్డి, రాధాకృష్ణయాదవ్‌, మూల అనీల్‌గౌడ్‌, స్రవంతి, దుర్గాప్రసాద్‌, మాణిక్‌ రావు, కృష్ణంరాజు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు ముఖ్యం



మాట్లాడుతున్న జగదీశ్వర్‌ గౌడ్‌

**శేరిలింగంపల్లి:** దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలడాలంటే ఓటు హక్కు ముఖ్యమైందని, దాని కోసం కాంగ్రెస్‌ పార్టీ పోరాటం చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్‌ గౌడ్‌ తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓట్‌ చోరీ వ్యతిరేక కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి నల్లగండ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత రాహుల్‌ గాంధీ ఇచ్చిన పిలుపుతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని జగదీశ్వర్‌ గౌడ్‌ తెలిపారు. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాడానికి ఓట్‌ చోరీని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించి.

## ఆర్థిక వ్యవస్థ సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేయాలి

**'నిథమ్‌'డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకటరమణ**



టీచర్లకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారితో నిథమ్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకటరమణ

**రాయదుర్గం:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేయడానికి ఉపాధ్యాయులు ముందుండాలని 'నిథమ్‌'డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వి.వెంకటరమణ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ–మాలవ్యా మిషన్‌ టీచర్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ (యూజీసీ–ఎంఎంటీటీసీ), 'మనూ'లోని వాణిజ్య, నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాలపాటు కొనసాగే రిఫ్రెషర్‌ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార, నిర్వహణ విద్య డిజిటల్‌ పరివర్తన, ఆవిష్కరణ, స్థిరత్వం ద్వారా పునర్నిర్వచిస్తున్నట్లు చెప్పారు. ప్రొఫెసర్‌ సనీమ్‌ ఫాతిమా మాట్లాడుతూ ఉన్నత విద్యలో నిరంతర అభ్యాసం, విద్యా పునరుద్ధరణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్కూల్‌ ఆఫ్‌ కామర్స్‌, బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ డీన్‌ ప్రొఫెసర్‌ రజౌల్లాఖాన్‌, డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ హెడ్‌ ప్రొఫెసర్‌ మహ్మద్‌ అబ్దుల్‌ అజీమ్‌, యూజీసీ– ఎంఎంటీటీసీ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ మెరాజ్‌ అహ్మద్‌ ముబార్కి, కామర్స్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ సైదలావి ప్రసంగించారు.

## 'మజిల్‌ మానియా–2025'లో ఓంకార్‌కు బంగారు పతకం



**రాయదుర్గం:** మజిల్‌ మానియా–2025 చాంపియన్‌షిప్‌ పోటీల్లో రాయదుర్గంలోని శ్యాంలేట్‌ వీధివాసికి బంగారు పతకం పొందారు. ఆదివారం నగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్‌ పోటీ (మజిల్‌ మానియా)లో సత్తాచాటిన శ్యాంలేట్‌ ఓంకార్‌ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించడం విశేషం. ఆలిండియా రెజ్లింగ్‌ చాంపియన్‌ శ్యాంలేట్‌ పాండు కుమారుడు ఓంకార్‌ అదే రంగంలో రాణించడం మరో విశేషం. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి మొదటి స్థానంలో నిలువడం, బంగారు పతకాన్ని బస్తీవాసి సాధించడంపై శ్యాంలేట్‌ వీధివాసులు సంతోషం వ్యక్తం చేసి ఓంకార్‌ను అభినందించారు.

## వ్యక్తి అదృశ్యం



జిలాన్‌ పాషా

**మియాపూర్‌:** వ్యక్తి అదృశ్యమైన ఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మయూరినగర్‌ కాలనీలోని సాధిక నివాస్‌లో షేక్‌ జిలాన్‌ పాషా(34), భార్య రేష్మతో కలిసి నివాసముంటున్నాడు. జిలాన్‌ పాషా గత నెల 30న సాయంత్రం 4 గంటల సమయంలో భార్య రేష్మ ఆఫీస్‌ వద్దకు వెళ్లి ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. కొంత సమయం తర్వాత ఆమె భర్తకు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్‌ వచ్చింది. అనుమానం వచ్చి భార్య వెంటనే ఇంటికి వెళ్లి చూడగా ఇంటి వద్ద భర్త కనిపించలేదు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త అదృశ్యం అయ్యాడని మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మందుబాబులకు జరిమానా

**పటాన్‌చెరు టౌన్‌:** డ్రంకన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 11మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా 10 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరోకరి రూ.1500 చొప్పన జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

## వాహనాల బ్యాటరీలు చోరీ

**మణికొండ:** కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో నిలిపిన వాహనాల బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. మణికొండ మున్సిపాలిటీ శ్రీరాంనగర్‌ కాలనీలో రెండు రోజులుగా కాలనీలోని ఖాళీ స్థలాల్లో టాటా ఏస్‌, డీసీఎం వాహనాలకు పూజలు చేసి నిలిపి ఉంచారు. సోమవారం ఉదయం చూసే సరికి వాటి బ్యాటరీలను దొంగిలించారని బాధితులు గుర్తించారు. కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవటంతో వారిని గుర్తించేందుకు వీలు పడటం లేదని, సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. బ్యాటరీ దొంగలపై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశామని వాహనదారులు తెలిపారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



చందానగర్‌ సర్కిల్‌ 21లో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు



మాట్లాడుతున్న డీసీ ప్రశాంతి తదితరులు

**చందానగర్‌:** చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఉప కమిషనర్‌ సురేష్‌ సర్కిల్‌ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై 8 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో టౌన్‌ ప్లానింగ్‌–1, ఇంజినీరింగ్‌–6, రెవెన్యూ–1 సెక్షన్‌లకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయన్నారు. వెంటనే ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కృష్ణ, ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవికుమార్‌, ఇంజినీరింగ్‌ డీఈ దుర్గప్రసాద్‌, ఎంటమాలజీ, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**మ్యాన్‌హోళ్లకు మర్మమతులు చేయాలి..**

చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని రాజేంద్రరెడ్డి కాలనీలో మ్యాన్‌హోళ్లు విరిగిపోయాయని మరమ్మతులు చేట్టాలని సోమవారం హాఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జీఎం శ్రీనివాస్‌రెడ్డికి అసోసియేషన్‌ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి కాలనీలో మ్యాన్‌హోళ్లు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయని, కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే మ్యాన్‌హోల్‌ మూతలు మార్చాలని జలమండలి అధికారులను కోరడం జరిగిందన్నారు. అసోసియేషన్‌ సభ్యులు జగన్నాథ్‌, దత్తు, శిరీష తదితరులు ఉన్నారు.

**శేరిలింగంపల్లిలో..**

**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్‌ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్‌ 2, అర్బన్‌ బయోడైవర్సిటీ, ఎస్టేట్‌ విభాగాలకు ఒక్కొక్కటిగా వచ్చినట్లు అధికారులు వివరించారు.

## పేదల ఆకలి తీర్చడానికే ఇందిరమ్మ క్యాంటీన్లు



ఇందిరమ్మ క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

**గచ్చిబౌలి:** పేదల ఆకలి తీర్చడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్లను సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టెలికామ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్‌లో రూ.5కే అల్పాహారం పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం కేవలం 5 రూపాయలకే అందిస్తోందన్నారు. పేదలు ఆకలితో అలమటించోవద్దనే ఉద్దేశంలో నగరంలో రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌బోర్ఖడే, డీసీ ప్రశాంతి, ఏఎంఓహెచ్‌ శ్రీకాంత్‌రెడ్డి,ఈఈ శిరీష, నాయకులు సత్యనారాయణ, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## విధులపై నిర్లక్ష్యం తగదు


**ఇస్నాపూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటకిషన్‌**



మాట్లాడుతున్న మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటకిషన్‌

**పటాన్‌చెరు టౌన్‌:** మున్సిపల్‌ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఇస్నాపూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటకిషన్‌ రావు సూచించారు. సోమవారం మున్సిపల్‌ కార్యాలయంలో సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేయాలని అన్నారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా.. చెత్త సేకరణ వాహనంలోనే వేసేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది పృథ్వీ, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌ అవుట్‌పోస్ట్‌ ప్రారంభం



ట్రాఫిక్‌ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభిస్తున్న గజారావు భూపాల్‌

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** తెల్లాపూర్‌లోని పాత మున్సిపల్‌ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్‌ అవుట్‌ పోస్ట్‌ను సోమవారం సైబరాబాద్‌ ట్రాఫిక్‌ జాయింట్‌ కమిషనర్‌ డా.గజారావు భూపాల్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని నూతనంగా తెల్లాపూర్‌ పరిధిలో ట్రాఫిక్‌ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరు తూ.చా తప్పకుండా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌గా అప్పలనాయుడు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ డీసీపీ రంజన్‌ రతన్‌ కుమార్‌, ట్రాఫిక్‌ అదనపు డిప్యూటీ కమిషనర్‌ వీరన్న, ట్రాఫిక్‌ ఏసీపీ వెంకటయ్య, మియాపూర్‌ ఏసీపీ శ్రీనివాస్‌, కొల్లూర్‌ ఇన్‌స్పెక్టర్‌ గణేశ్‌ పటేల్‌, రామచంద్రాపురం ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణలో పర్యాటకులకు భద్రత కల్పిస్తాం

**తెలంగాణ రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీ మహేష్‌ భగవత్‌**



నిథమ్‌లో పర్యాటక పోలీసులకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అదనపు డీజీపీ

**రాయదుర్గం:** తెలంగాణలో పర్యాటకులకు సంపూర్ణ భద్రత, సహాయం అందించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మహేష్‌ భగవత్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'నిథమ్‌'క్యాంపస్‌లో తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ కోసం ఒక వారం శిక్షణా కార్యక్రమంలో ఆయన 'నిథమ్‌'డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకట రమణతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రధాన గమ్యస్థానాల్లో పర్యాటకులకు సహాయం చేయడానికి తెలంగాణ పోలీసులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. పర్యాటక భద్రతను బలోపేతం చేయడానికి, తెలంగాణ అంతటా సందర్శకుల అనుభవాన్ని మెరుగుపర్చడానికి ఒక ముఖ్యమైన చొరవలో తెలంగాణ పోలీసు శాఖ, యూత్‌ అడ్వాన్స్‌మెంట్‌, పర్యాటక, సాంస్కృతిక శాఖ సమన్వయంతో రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రదేశాలలో శిక్షణ పొందిన పర్యాటక పోలీసు సిబ్బందిని నియమించిందన్నారు. తెలంగాణలోని పర్యాటక పోలీసులు సందర్శకులకు సహాయం చేయడమే కాకుండా శాంతిభద్రతలను నిర్వహిస్తారని ఆయన గుర్తుచేశారు, అమ్రాబాద్‌, సోమశిల అనంతగిరి, రామప్ప, యాదగిరిగుట్ట, పోచంపల్లి, బుద్ధవనం, భద్రాచలం, హైదరాబాద్‌ వంటి కీలక ప్రదేశాలలో పర్యాటకాన్ని సులభతరం చేస్తారన్నారు. పర్యాటక పోలీసులకు శిక్షణలో సాఫ్ట్‌స్కిల్స్‌, టూరిస్ట్‌ ఫెసిలిటేషన్‌, పబ్లిక్‌ గైడెన్స్‌, ఫెస్టివల్‌ అండ్‌ క్రౌడ్‌ మేనేజ్‌మెంట్‌, ఎమర్జెన్సీ సంసిద్ధత, కమ్యూనికేషన్‌ అండ్‌ కోఆర్డినేషన్‌, ఎథిక్స్‌ అండ్‌ సైబర్‌ అవేర్‌నెస్‌ శిక్షణ ఇస్తారని ఆయన వివరించారు. నిథమ్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకట రమణ మాట్లాడుతూ..తెలంగాణలో పర్యాటక రంగం అభివృద్ధికి వృత్తిపరమైన శిక్షణ, సామర్థ్యం అవసరమన్నారు. రాష్ట్రానికి మంచి ఇమేజ్‌ను అందించాల్సిన అవసరాన్ని ఎప్పటికప్పుడు సీఎం నొక్కి చెప్పారని గుర్తుచేశారు. పర్యాటక భద్రతను పెంపొందించడానికి, సందర్శకుల అనుభవాన్ని మెరుగుపర్చడానికి తెలంగాణ ప్రభుత్వ చొరవలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కీలక పర్యాటక ప్రదేశాల్లో విధి నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఎంపిక చేసిన పోలీసులను ప్రభుత్వం నియమించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9 కమిషనరేట్ల పరిధిలోని 80 మంది పోలీసులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు రమణకుమార్‌, ఎఫ్‌టీసీసీఐ టూరిజం కమిటీ చైర్మన్‌ ప్రకాశ్‌ అమ్మనబోలు, కో చైర్మన్‌ రామచంద్రన్‌, నిథమ్‌ అధ్యాపకులు, వివిధ రంగాలు, మీడియా, వైద్య, క్రీడలు, యోగా, సాఫ్ట్‌స్కిల్స్‌, కమ్యూనికేషన్‌, ఇతర విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.